అమాయకుడు

[కథానిక]

శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తి

"ఇన్నాళ్లు పూరుకుంటే నీకు సీటు ఎలా వుంటుం దనుకున్నావు?" అన్నాడు ప్రిన్సిపాల్ లాంఛనంగా.

"ఆలిస్యం అయిపోయిందండి! అన్నిటికీ నాకు నేనే రావటంవల్ల ఇలా అయింది!" అన్నాడు శాస్త్రి వినయవిధేయతలతో.

"మరి సర్టిఫికేటూ, జీతం సిద్ధంగా వున్నయ్యా?"

"చిత్తం!"

"అయితే ఈ ఫారం పూర్తిచేసి జీతంకట్టి వెంటనే క్లాసుకు వెళ్లిపో!"

శాస్త్రి జీతంకట్టి రసీదు తీసుకుని వెళ్లబోతుండగా ప్రిన్సిపాలు పిలిచాడు.

"ఇప్పటినించీ నీవు సరిగా కాలేజీకి వచ్చినట్లయితే అటెండెన్సు సరిపోతుంది. నీ అశ్రద్ధవల్ల కానీ, మరి ఏ ఇతర కారణంవల్ల కానీ అటెండెన్సు కనక చాలకపోతే నే నేవిధంగానూ సహాయం చెయ్యను. ఆలిస్యంగా చేరతానంటేమటుకు నన్నెందుకు చేర్చుకోవాలని అప్పుడు నీవు వాదించి లాభం వుండదు. ఇవన్నీ నీవు ముందరే తెలుసుకుని కాలేజీలో చేరినట్టు భావిస్తున్నాను!"

"ఫరవాలేదండీ!" అన్నాడు శాస్త్రి దిమ్మెరపోయి.

"ఆల్‌రైట్!"

ఆసాయంకాలం గంట కొట్టగానే అందరితోపాటు శాస్త్రి తన కొత్త స్నేహితుడితో (ఆలిస్యంగా చేరే వాడికి ఎవడో ఒకడు రెండునిమిషాలలో దొరకకపోడు) గది బయటికి వచ్చాడు. ఓ యాభైమంది విద్యార్థులు గుంపుకూడి ఏమిటో చేస్తున్నారు. శాస్త్రి ఏమిటో చూద్దామని స్నేహితుడితో ఆగుంపును సమీపించాడు. అందరు మగ విద్యార్థులమధ్య ఓ విద్యార్థిని తలవంచుకుని నిలబడి వున్నది. ఆమె పక్కన మగవిద్యార్థి ప్రవాహాన్ని ఆపుతూ కార్తవీర్యార్జునుడిలా ఓ బ్రాహ్మణుడు నిలబడివున్నాడు. ప్రతి శుక్రవారం ఇంతేనని శాస్త్రికి తర్వాత తెలిసినప్పటికీ అప్పుడు ఈ సినిమా ఏమిటో అర్థం కాలేదు. ఇంతలో అర్థం అవుతున్నట్టు అనుమానం వేసింది. ఆమెముందున్న ఇనప మెట్లమీదుగా మొదట తలలు, తర్వాత నడుములు, ఆతర్వాత కాళ్లు బయటపడుతూ ఒక్కొక్కరే విద్యార్థులు పైకి వచ్చి పైన వున్న తోటి విద్యార్థులు ఇచ్చిన దారిగుండా వెళ్లిపోతున్నారు.

ఆ గుండ్రంగా దిగిపోయే ఇనప మెట్లమీదుగా ఇద్దరు కలిసి దిగిపోవచ్చు, లేక ఇద్దరు కలిసి పైకి రావచ్చు—లేదా ఒకరు దిగిపోతుండగాగాని, పైకి వస్తుండగాగాని మరొకరు పైకి వస్తూగాని కిందికి పోతూగాని ఒకరిని ఒకరు దాటిపోవచ్చు పురుషులయితేమటుకు. లేక అందరూ స్త్రీలయినా ఫర్వాలేదు. అంతే కాని ఒక స్త్రీ కిందికి పోతుండగా గాని, పైకి వస్తుండగాగాని ఒక పురుషుడు అదేసమయంలో పైకి వస్తూగాని కిందికి పోతూ గాని మధ్య ఒకరిని ఒకరు దాటిపోవటానికి పురుషుడికి అభ్యంతరం లేకపోయినప్పటికీ స్త్రీ సమ్మతించదు. స్త్రీకి సమ్మతం ఉన్నప్పటికీ అభాజను డైతే పురుషుడికి సమ్మతం ఉండదు. ఇద్దరికీ సమ్మతం వున్నప్పటికీ అలా చెయ్యటానికి కాలేజీచట్టం ఒప్పుకోదు. కాలేజీకి అటువంటి చట్టం లేకపోతే ఎవడో ఒకడు సైంధవుడల్లే అడ్డుపడి అలాంటిది జరగకుండా చెయ్యటం తప్పదు. ఏతావతా స్త్రీలూ పురుషులూ ఎంత సమాన మయినప్పటికీ ఆ మెట్లమీద ఒకరిని వొకరు దాటిపోరు. ఇంతవరకు జరగలేదు. స్త్రీ మెట్లు దిగిపోతున్నా, ఎక్కిపోతున్నా పురుషుడు మూడుమెట్లు ఎడంగా దిగిపోవటంగాని ఎక్కిపోవటం గాని జరగాలిసిందే. అందు కెవ్వరూ ఏమనరు. ఒకవేళ స్త్రీ మెట్లు దిగి

వస్తున్నప్పుడు గాని, ఎక్కి వస్తున్నప్పుడుగాని పురుషుడు ఎక్కిపోతూగాని, దిగిపోతూగాని ఎదురుపడితే— ఇలా జరగటానికి బోలెడు వీలుంది. ఎందుచేతనంటే: పైనున్న వారికి కింది నించి స్త్రీగాని పురుషుడుగాని అసలు వస్తున్నదీ లేనిదీగాని, అలాగే కింది వారికి పైనించి స్త్రీగాని పురుషుడుగాని అసలు వస్తున్నదీ లేనిదీ గాని మెట్లు గుండ్రంగా తిరిగిపోవటంవల్ల తెలియదు— ఏమవుతుంది ? అడవిలో సింహమూ, పెద్దపులీ ఎదురుపడితే ఏమవుతుంది? అడవిలో ఏమవుతుందో చెప్పలేం కాని, ఇక్కడ ఒకరి మొఖాలు ఒకరు చూచుకుంటారు. అదివరకు స్త్రీ విద్యార్థినులు వెళ్లుతుంటే ఆపుకో లేకుండా వెకిలినవ్వు నవ్వేవా డయితే వెధవ మొహంవేసి ఆమెవంక చూస్తాడు. ఎన్నడూ అదివరకు అతన్ని కన్నెత్తి అయినా చూడని దయితే ఆమె మొదటిసారి ఆపని చేస్తుంది. బయట సారకాయలునరికేవాడయితే అతడు ముందర వెనక్కి తిరిగి మెట్లు దిగటంగాని, లేక వెనక్కి తిరగకుండానే మెట్లు ఆమెను చూస్తూనే ఎక్కి ఆమెకు దారి ఇయ్యటంగాని జరుగుతుంది. స్వాతంత్ర్యముకోసం సమరం చేసే యువతయితే వెనక్కి తిరిగి మెట్లు దిగటంగాని, ఎక్కిపోయి అతనికి దారి ఇయ్యటం గాని జరుగుతుంది. అతను ఎన్నడూ ఆడది తన వంక చూడనివాడయితే, భర్తచేత అడిగినప్పుడల్లా ముద్దు పెట్టుకోనిచ్చేటటువంటి ముగ్ధలాంటి దయితే ఎవరోమూడోవారు పైనించో కింది నించో వచ్చేవరకూ అలాగే నిలబడి పోతారు ఒకరివంక ఒకరు బెదరు చూపులు చూస్తూ. అంతేగాని ఒకరిని ఒకరు దాటిపోరు !

ఇంతలో పైకి వచ్చే విద్యార్థులు అయిపోయినారు. రెండు సెకండ్లు వూరుకుని ఆ బ్రాహ్మణుడు ఆమెకు 'పద' అన్నట్టు సౌంజ్ఞ చేశాడు. ఆమె కాలు మెదిపిందో లేదో మళ్లీ ఇంకోడు పైకి వచ్చాడు.

"ఇంకా ఎవరన్నా వున్నారా కింద?" అన్నా డా బ్రాహ్మణుడు ముక్కోపంతో.

"చాలామంది వున్నారండి !" అన్నా డతను.

"పైకి వస్తున్నారా?"

"తెలేదండి!"

ఒక్కనిమిషం ఆగారు. ఎవ్వరూ పైకిరాలేదు. ఎవరో శాస్త్రి వెనక "రైట్" అన్నారు. విద్యార్థులలోనించి బయలుదేరబోయే కలకలారవ మంతా ఆ బ్రాహ్మణుడు చూచిన శబ్దవేది చూపుతో పొంగే పాలమీద నీళ్లు పోయగానే అణిగిపోయినట్టు అణిగి పోయింది. ఏమనుకున్నాడో ఏమో, "పద" అని ఆమెను రూల్సుప్రకారం మూడు మెట్లు దిగనిచ్చి ఆ వెధవ కూత వచ్చినవేపే చూస్తూ దిగిపోయినాడు. శాస్త్రికి కనపడ్డది ఆఖరుకు ఆయనకన్నులు. తర్వాత భాగంలో అతనికి అభిరుచి లేకపోయింది.

అందరూ దిగనిచ్చిం తరవాత "ఆమె ఎవరూ?" అని అడిగాడు శాస్త్రి కొత్త స్నేహితుడిని.

"మనక్లాసేలే!" అన్నా డతను.

"ఆమెపేరు?"

"రాధిక!"

"ఆయ నెవరు?"

"తెలుగు లెక్చరర్—దీక్షితులు గారు."

"ఆమెకు చుట్టమా?"

"ఆమె విద్యార్థిని ; ఆయన లెక్చరర్. మనకు తెలిసినంతవరకు అంతకంటె బాంధవ్యం లేదు. విద్యార్థినులను విద్యార్థులబారినుండి తప్పించటం ఆయనకు హాబీ. ఆ అమ్మాయిని రక్షించటం ఆయనకు విధి! అయితే ఈయన కాన్వాయిపద్ధతి కొంత మంది స్త్రీలకే ప్రాణసంకటంగా వుంటున్నప్పటికీ మొత్తంమీద గుణం కనిపించకపోలేదు. ఆమె అంటే ఆయనకు ప్రాణం!"

"ఆచికిలికన్నులచకోరాక్షా!"

అతను శాస్త్రివంక ఒక్కనిమిషం చూశాడు జాలిగా!

"అప్పుడే అయిందీ! ఆమెతో నీవు వెర్రిమొర్రివేషాలు ఏమైనా వేసినావట్టయినా నీకూ, ఆయనకూ గట్టి రంధి పడుతుంది తెలిసిందా? ఆతర్వాత ఆయన నిన్నేమీ చెయ్యకుండా ప్రిన్సిపాల్ కాదుకదా బ్రహ్మదేముడు ఆపలేడు. ఆమెకు సంగీతం చెప్పుతున్నాడనో, చెప్పిస్తున్నాడనో విన్నాను. ఆమెను విపరీతమైన తెలివితేటలుకలదాన్నిగా చేసి, అన్ని విషయాలలోనూ సాటిలేని మేటిగా చేసి, ఆమె అట్లా కావటానికి తనే కారణం అని లోకానికి అనుమాన మే

కలగనిచ్చి, ఎవరైనా ఆమెను అట్లా శీలవంతురాలిగా చేసినందుకు ఆయన్ని అభినందించబోతే "నా దేమీ లేదండీ! అసలు బంగారం మంచిది కావాలి" అని ఒక్క చిరునవ్వుతో తప్పుకునేస్థితిలో ఎల్లప్పుడూ వుండి, వొంటరిగామటుకు రాధిక చేతనే అరగంట కొకసారి మెప్పు పొందాలని ఆయనకు వుంది! సెనగలసెట్టి మామిడిటెంకమింగికూచుని వూరికే తనలో తానే నవ్వుకుని రత్నాలు రాసులుగా చెయ్యటం ఎరగవూ? రాధిక గుణవతి అయిన ఏసినిమాస్టారో, ఏ ఎసెంబ్లీమెంబరో, ఏకళాశాలలోనో ఏ లెక్చరరో అయి ఎవ్వరికీ మాట్లాడటానికిగూడ అందక, ఏధనవంతుడినీ సమానంగా చూడక, ఏఅధికారినీ లక్ష్యంచెయ్యక ఎప్పుడైనా స్వగ్రామం చేరి తన ఇంటికి ఆ కుచేలుడి ఇంటికి సాక్షాత్తు ఆ శ్రీకృష్ణభగవానుడేతెంచినటుల ఏతెంచి పురజనులకూ, పురప్రముఖులకూ, రాష్ట్రీయాధికారులకూ ఆశ్చర్య సంభ్రమములు కలిగించిందనుకో! "ఆతార ఈ గోచిపాతరాయడింటికి ఎందుకు వెళ్లెను" అన్న ప్రశ్నకు "ఆమె అలా కావటానికి కారణం ఆయనే! ఆయన ఆమెకు గురువు" అని సమాధానం రాగానే "ఔరౌరా!" అని అందరూ ఆశ్చర్యచకితులు కారో? అది ఆయనకు ఇష్టం!"

"చాలాదాకా వుందే!"

"మరేమి టనుకున్నావు? ఈ సంగతి తెలియక ఒకడు ఆమెకు ఏదో వుత్తరం రాశాడు. వెధవ వుత్తరం ఎందుకు సాక్ష్యంగా? ఈలలు వేశో, ఒక కంటితో సౌంజ్ఞ చేశో, ఫలించకపోతే రెండు కళ్లతోనూ, చివరకి తలతోనూ సౌంజ్ఞలు చెయ్యకా! అప్పటికీ లాభించకపోతే దిక్కుమొహం వెయ్యటం వుండనే వుంది కదా? ఆపైని అర్ధరాత్రివేళ ఆమె ఇంటిచుట్టూ తిరగటం మొదలయినవి ఆమెకే తెలిసేవి, ఇబ్బంది లేనివి బోలెడు చిటికెలుండగా వుత్తరం రాశాడు. మమ్మల్ని కన్సల్టు చేసినా ఏదో విధంగా వెలిగించేవాళ్లం. అలాంటిదేమీ లేకుండా, వుత్తరం రాశాడు. పైగా తనే రాసినట్టు తెలియటానికి సంతకం చేశాడు. ఆమె ఏంచేసిందనుకున్నావు? ఆవుత్తరం చించి వీడి మొహాన పారేసి వుమ్మెయ్యకుండా, ఆయనకు చూపించింది! చూపించింది అని మా అనుమానం. మర్నాడు ఆయన వాడికి పదిహేపాయలు అసహ్యమైన ప్రవర్తనకు ఫైను వెయ్యటమూ, దోర పదిరోజులు సస్పెండు చెయ్యటమూ జరిగినై. రేపటినించీ వాడూ వస్తాడు కాలేజీకి. ఆయనకు తెలియకుండా ఆమెఅనుగ్రహాన్ని సంపాదించాలన్న వుద్దేశ్యంతో — అంతకన్న వేరేవుద్దేశ్యం ఏమీ వుండివుండదులే — ఆయనదగ్గిర గూఢచారులుగా చేరారు కొందరు. ఎవరు ఆమె వంక ఎప్పుడు ఎట్లా చూచేదీ ఆయనకు చెబుతుంటారు. ఆయన్ని గురించి ఎవ రేమనుకునేదీ— ఏ విషయంలోనైనా సరే — ఆయనకు తెలియబరుస్తారు. అందుకని, ఇవాళే చేరావు కనకనూ, రేపే ఇంటికి పోవటం నా కిష్టంలేదు కనుకనూ చెప్పుతున్నా."

"ఆఁ, నా కెందుకు?"

"ఆమెను బాగా తర్ఫీదు చేసి ఆయనే వివాహంచేసుకుంటా డని గిట్టనివాళ్లు ఇద్దరుముగ్గురు కసితీర్చుకోటానికి పుకారు పుట్టించినా నిజమయివుండ దని నానమ్మకం. ఆయనకు యాభై దాటాయి; ఆమెకు పదహారు దాటాయేమో. అంతే! ఆదంతా వట్టిదికాని ఆయనబంధుకోటిలోనే ఎవరన్నా వున్నారేమో నని నా అనుమానం. ఈకాలేజీలో ఆమెతో చదివేవాళ్లని చూస్తేనే ఆయనకు కోపం!"

"చాలాముఖ్యమైనది చెప్పావు!" అన్నాడు శాస్త్రి.

"ఫలితం దక్కనప్పుడుకదా?"

మర్నాడు శాస్త్రి గ్రూపుమార్చి రాధికతీసుకున్న గ్రూపు తీసుకుని ఆమెవున్న క్లాసుకు వెళ్లాడు. మన్ను తిన్న పామల్లే అదివరదాకా ఏదో చెప్పుతున్న దీక్షితులుగారి కళ్లు శాస్త్రిని చూడగానే మెరిసినై!

శాస్త్రి పిల్లల్లే ప్రవేశించి నిలుచున్నాడు.

"ఎవరు నీవు?"

"కాలేజీలో కొత్తగా చేరిన విద్యార్థిని!"

"ఎప్పుడు చేరావు?"

"నిన్న."

"ఏంగ్రూపు?"

"మీ గ్రూపేనండి!"

"మరి నిన్న క్లాసుకు రాలేదేం?"

"నిన్న ఇంకో గ్రూపు తీసుకున్నానండి—ఇవాళ మార్చాను."

తోకతొక్కిన తాచల్లే లేచి కూర్చున్నాడు దీక్షితులుగారు!

"కారణం?"

"నాకు అది నచ్చలేదండి!"

"ఇది నచ్చుతుం దని ఏమిటి నమ్మకం?"

"ఇది నచ్చకపోతే ఇంకోటి తీసుకుంటానండి!"

"ఇందుకేనా నీవు కాలేజీకి వచ్చింది?"

"దేనికండీ?"

"రోజుకో గ్రూపు మార్చటానికేనా?"

"కాదండి!"

"మరి?"

"అందరూ ఎందుకు కాలేజీకి వచ్చారో అందుకే వచ్చానండీ!"

"అందరూ చదువుకోటానికి వచ్చారు."

"నేనూ అందుకేనండీ!"

"మరి అందరూ నీకుమల్లే గ్రూపులు మార్చటం లేదే?"

"అందరూ నాకుమల్లే మార్చటం లేదు కాని నాకుమల్లే మార్చినవారు లేకపోలేదండి."

"ఎవరు?"

"ఈ క్లాసులోనే వున్నారు. మీకుమల్లే తెలుగుభాషని బోధించేవారు లేరన్న సంగతి జగద్విఖ్యాత మే కాకుండా నిన్న ఒకరు చెప్పగా విన్నానుకూడాను. అప్పుడే మీ క్లాసుకు వద్దామనుకొన్నాను."

"ఎవరా చెప్పింది?"

"నాకు పేరు తెలియదండీ!" శాస్త్రిచూపు దూరాన రాధికకు సమీపంలో కూచున్న స్నేహితుడి మీద పడ్డది. వాడు శరీరమంతా కళ్లుపెట్టుకు ఇతనివంక చూస్తున్నాడు బిక్కమొహంతో!

"నువ్వు నాక్లాసులో వుండటానికి నాకు అభ్యంతరం లేదుకాని నువ్వు కొద్దిరోజులలోనే ఇంకో క్లాసుకు వెళ్లిపోవలసివస్తుందేమోనని నాభయం!"

"ఎందుకని అండీ!"

"నాకు చిలిపిచేష్టలు చేసేవారంటే మహా అసహ్యం. కావాలంటే వీరిలో ఎవరిని అడిగినా చెపుతారు!" అన్నాడు దీక్షితులుగారు ముందుకు వంగి శాంతంగా.

ఇంతలో గంట కొట్టారు. దీక్షితులుగారు లేచి శాస్త్రివంక అలాగే చూస్తూ నిష్క్రమించాడు. ఆయన వెళ్లాడో లేదో పదిమంది వచ్చి ఇతని చుట్టూ మూగారు. ఒకడు ఇతని రొమ్ముమీద చెవిపెట్టి గుండె ఎలా కొట్టుకుంటున్నదో పరీక్షించాడు. అట్లా ఒకరితర్వాత ఒకరు పరీక్షిస్తూవున్నారు. ఇంతలో తర్వాతి క్లాసుమేష్టరు వచ్చాడు. ఎక్కడివారక్కడకు వెళ్లి చతికిలబడ్డారు.

కాలేజీ వదలగానే స్నేహితుడు శాస్త్రిని కలుసుకున్నాడు.

"నీకు గట్టిగుండె వుంది కాని లాభం లేదోయి బ్రదర్! నీకూ ఈయనకూ యుద్ధం తప్పదనీ, దాని ఫలితం నీకే ఎక్కువ నష్టకరంగా వుంటుం దనీ వామాత్మ చెప్తూవున్నది."

"ఎందుకని?"

"ఏమిటా సమాధానాలు?"

"ఏమిటా ప్రశ్నలు?"

"వాటికి సమాధానం లేదు!"

"ఆయన అడిగినా?"

"మమ్మల్నెవర్నీ అట్లా అడగ దేం?"

"మీ రెవ్వరూ జవాబివ్వరు కనక!"

"మేం చేసేదే తెలివిగల పద్ధతి అంటున్నాను."

"నేను చేసిందాంట్లో తప్పు లే దంటాను!"

"నీయిష్టం కాని జాగర్త. తర్వాత నేను చెప్పలే దనుకోవద్దు. అసలు దానికి మల్లే నాజూకుగా వున్నాను కదా తప్పించుకోలేనా అనుకుంటున్నావేమో!"

"మీ రిట్లా వున్నారు కాబట్టే ఆయన పట్టా చెలాయిస్తున్నాడు. మనవల్ల తప్పు లేనప్పుడు భగవంతుడుమటుకు మన నేమి చెయ్యగలడో నాకర్థం కాలేదు!" స్నేహితుడు పెదిమ విరిచాడు.

రోజులు గడిచిపోతున్నాయి. శాస్త్రి మామూలుగానే కాలేజీకి

పోతున్నాడు. దీక్షితులుగారి కన్ను ఒకటి తనమీదకి వున్నట్టు తనకే కాకుండా అందరికీకూడ తెలుసు ననుకున్నాడు. బయటికి శాంతంగా వున్నా లోపల అగ్ని రగుల్కొంటూ నేవున్న దని శాస్త్రిస్నేహితుడికి అనుమానంగానే వుంది. దానికి తగ్గట్టుగా నిదర్శనాలు కనుపించకపోలేదు. శాస్త్రి ఆలిస్యంగా వస్తే దీక్షితులుగారు ఘోరమైన నేరంగా పరిగణించి సహించలేకపోవటమూ, శాస్త్రి పక్కవాడితో ఏది మాట్లాడినా బుస్సున తాచల్లే లేవటమూ దేనినైనా సమర్థించబోతే శాస్త్రిని బలవంతాన కూచోపెట్టటమూ మొదలయినవి ఆరోజుకారోజుకు వృద్ధిఅవుతున్నాయి. ఇతరు లింకెవరు అలా చేసినా దీక్షితులుగారు అట్టే పట్టించుకోకపోవటమూ, శాస్త్రినే సహించలేకపోవటమూ శాస్త్రిస్నేహితుడు గమనించాడు. కారణమేమిటో అతనికి అర్థం కాలేదు. ఎవ్వరికీ అర్థంకాలేదు ఆమాటకొస్తే. దీక్షితులుగారి చర్య శాస్త్రిస్నేహితుడికి అర్థం కాకపోయినా తప్పు శాస్త్రిదే అయివుంటుందని అతని అనుమానం. ఒకరోజున శాస్త్రిని నిలవేసిఅడిగాడు. తనేమీ చెయ్యలేదని విసుక్కున్నాడు శాస్త్రి. అకస్మాత్తుగా శాస్త్రి స్నేహితుడికి ఒకఆలోచన కలిగింది.

"నువ్వు కాలేజీలో చేరినరోజున రాధిక మెట్లు దిగబోతుంటే ఎవరో 'రైట్' అనటం నీకు జ్ఞాపక ముందా?" అన్నాడు స్నేహితుడు.

"ఆ!"

"అప్పు డాయన ఆశబ్దం వచ్చిన వైపు చూచాడు జ్ఞాపక ముందా?"

"ఆ!"

"మన వెనక ఎవరో ఆమాట అన్నారు. ఆయన మనవంక చూచాడు. నీవు కనపడివుంటావు. నువ్వే అది అన్నా వని ఆయనకు అనుమానం కలిగివుంటుంది. నీది కొత్త మొహం కావటం చూసి అప్పు డేమీ చెయ్యలేకపోయినా డనుకుంటాను. తగినట్టు మర్నాడు నీవు ఆయనక్లాసుకు వచ్చావు. అందుకనే చిలిపిచేష్టలు చేసేవా రంటే నాకు మహా అసహ్యం అన్నాడు, జ్ఞాపక ముందా?"

"ఆ!"

"ఆయన వుద్దేశం అనుమానించవలసిన సందేహం లేదు. నువ్వే ఆ మాట అన్నా వనుకుని సరికొత్తవాడివి కావటంవల్ల అంత తేలికగా పోనిచ్చాడు. కాని అది బైటికి వస్తునేవుంది! నన్నయినా నిన్నయినా అనుమానించాలి ఆమాటన్నట్టు. నాకు ఇంకా వారంటు పుట్టలేదు కనక ఆయన నిన్నే అనుమానిస్తున్నాడని నానమ్మకం. చూశావా?"

"మరి నేచేసిన తప్పేమిటి?"

"ఆయన కేం తెలుసు ఆసంగతి?"

"అందుకని నన్నిట్లా చూస్తాడా?"

"ఆయనగుణం అది! అదీకాక ఫలాని తప్పు నేను కాదు చేసింది అని చెప్పటానికి కూడ వీలు లేదు. ఇది ఎవరు చేసింది అని ఆయనకు అనుమానం లేకుండానే తెలిసిపోయె!"

"వీలుంటేమటుకు వెధవపనికి ఆయనతో మొరపెట్టుకుంటామా?"

"మరి ఏమిటి చెయ్యటం?"

"మాట్లాడకుండా వూరుకోటమే!"

"దానివల్ల ప్రయోజనం లేదు. అసలు నువ్వు రాధిక తీసుకున్న గ్రూపు తీసుకోకపోతే ఆయన అంతటితోనే మరిచిపోయేవాడు. నువ్వు మర్నాడే ఆయనక్లాసుకు చేరితివి."

"అయితే?"

"అదీకాక నువ్వు ఆయన అనుమానించినట్టు చిలిపిచేష్టలు చేసేవాడివే అయినట్లయితే ఆయన కింత బాధ వుండదు. ఎప్పుడో నిన్ను పచ్చడిచేసేవాడు. అట్లాకాక నువ్వు నిజంగా చిలిపిచేష్టలు చెయ్యనివాడవయినప్పటికీ చేయనివాడివిలాగ కనిపించటంచేత నిన్నెట్లా సాగతీయాలో ఆయనకు అర్థం కాలేదు! మొదటిరోజున నీమాటలు చూసి ఆయనకు అనుమానం వేసివుంటుంది ఎవరో గడుసుపిండమేనని! ఆయనతో అదివరకలా మాట్లాడినవాడే లేకపోయె! అందుచేత తలకాయ లోపలికి దూర్చిన తాబేలులావున్నావు ఆయన ప్రాణానికి. నేర్పరిఅయిన దొంగవనీ, నీతో జాగ్రత్తగా వుండటం అవసరమేననీ ఆయనకు నమ్మకం కలిగిందని నా అనుమానం!"

"అదిమటుకు నిజం! ఆయన సంగతి పూర్తిగా స్టడీచేసినట్టున్నావే?"

"ఇదంతా నాతెలివికాదు! నేను కిందటేడాది ఆయనచేత డిటెయిన్ చేయించబడ్డాను. అదివరకు నేను నీకు చెప్పినట్లే ఇతరులు ఆయన్ని గురించి చెపితే నేను నమ్మలేదు. ఆయనదెబ్బ తగిలింతరువాత గాని ఆయనతత్వం నాకు బాగా అర్థం కాలేదు! ప్రతి సంవత్సరమూ ఆయన ఆగ్రహానికి ఎవడో వొకడు గురి అవుతూనే వున్నాడు."

"నిజంగానా?" అన్నాడు శాస్త్రి.

వారం రోజులు గడవక మునుపే "లెక్చరర్లతో అసహ్యంగా మాట్లాడినందుకు" శాస్త్రికి రూపాయ ఫైను వేశాడు దొర! శాస్త్రిని యజ్ఞపశువు కింద కట్టేశారు విద్యార్థు లంతా. శాస్త్రి మటుకు మాట్లాడలేదు. తన తప్పేమీ లేదని దొరతో చెప్పను కూడ లేదు. వెంటనే వెళ్లి ఫైను చెల్లించాడు. పదిహేను రోజులలో మళ్లీ రూపాయ ఫైను పడింది! దొర పిలిచి "ఏమిటి ఇది" అని అడిగాడు. "మీకు తెలియని దేముంది ?" అన్నాడు శాస్త్రి.

"ఈతడవ నీకు ఫైను ఒక్క రూపాయతో పోదు. యాభై ఏళ్ల లెక్చరర్ని అవమానించటానికి నీ వెంత వాడివి ?"

శాస్త్రికి కాలేజీఅన్నా, లెక్చరర్లన్నా అసహ్యంవేసింది. అత నెంత వుత్సాహంతో పొలం అమ్మి కాలేజీలో చేరాడు! అతను కట్టిన మేడలన్నీ ఏమయిపోయినై ?

ఒకరోజున ప్రిన్సిపాల్ దొర అందరినీ హాలులోకి హాజరుకమ్మని నోటీసుఇచ్చాడు. అందరూ చేరింతరువాత దొర శాస్త్రిని పేరుపెట్టి పిలిచాడు. శాస్త్రి ఏదో వచ్చిందనుకుని నిలబడ్డాడు.

"నీమీది కొక అపరాధం వచ్చింది. వూళ్లో విషయాలు కథలుగానూ, పద్యాలుగానూ రాసేవాళ్లున్నారు. ఒకపుస్తకంలోనించి ఒకవిషయాన్ని తీసుకుని స్వంతవిషయమల్లే అక్కడక్కడ మార్చి చెత్తసాహిత్యాన్ని సృష్టించేవా రున్నారు. కాని నీకు మల్లే మూలానికి మూలం ఎత్తి స్వంత పేరుతో ప్రకటించేవాళ్లుండరని నానమ్మకం! కాలేజీతరఫున ప్రకటిస్తున్న పత్రిక ఇలాంటి రచనలకూ, రచన చేతకాని రచయితలకూ నిర్దేశించబడింది కాదు. రచనాశక్తివున్న వాళ్లు తమ శక్తిని పదును పెట్టుకోటానికే ఇది వుద్దేశించబడింది. మొన్న వెలువడిన సంచికలో నీ పేరుతో ప్రచురించబడిన పద్యాలు నీవికావు. నీవు చేసిన దొంగతనం బైట పడదని నీ కెలా ధైర్యం కలిగిందో నాకు ఆశ్చర్యంగా వుంది! ఇలాటిపని చేసినందుకు నీ వేమి చెప్పుకుంటావో నీ స్నేహితులముందు చెప్పుకోవలసింది!" అన్నాడు ప్రిన్సిపాల్. హాలంతా నిశ్శబ్దం అయిపోయింది. అందరూ ఆశ్చర్యంగా అతనివంక చూచారు. శాస్త్రి మెల్లిగా వెళ్లి బల్లదగ్గిర నిలబడ్డాడు. అతని మొహాన కత్తివాటు వేస్తే నెత్తురు లేదు!

"ఇది చాలా అన్యాయం!" అన్నాడు అతను మెల్లిగా. "నా పేర అచ్చుపడిన పద్యాలు దొంగిలించిన వని చెప్పగలిగిన పండితు లెవరో నాకు తెలుసు. మీఅందరికీకూడ తెలుసునేమో. నేను దొంగతనంచేశానని అనుకున్నా నాకు జరపవలిసిన శిక్ష ఇటువంటిది కాదేమో. నన్ను దొర చీవాట్లు పెట్టవచ్చును. నాకు విపరీతమైన ఫైను వెయ్యవచ్చును. నేను చేసిన పని అందరికీ తెలిసేటట్టుగా నోటీసుఇచ్చి నాకు అవమానం కలగ చెయ్యవచ్చును. కాని దానితో వారికి తృప్తితీరకపోవటంచేత ఇలా జరిపారేమో! వ్యాసాల్ని చోరీచేసిన వారి గతి ఇంతేనన్నట్టు దాఖలా చూపించారు కాలేజీవారు! నేను చేసిన పని అంత ఘోరమైనదా? దీని కింత ఘోరమైన అవమానం చెయ్యాలా? కాని దొరగారు వారంతట వారు ఇలా చేసివుంటారని నేను అనుకోను. నామీద ఏకారణం వల్లనో క్రోధరసం తల కెక్కినవాడు ఈచాడీ చెప్పివుండాలి! కాని అతని కోరిక తీరనందుకు నేనూ, అతనూ విచారపడుతున్నాం. అత నెంత తెలివికలవాడయినప్పటికీ ఇక్కడ పప్పులో కాలు వేశాడు. అసలు సంగతి ఏమిటంటే, ఏపద్యాలయితే నేను దొంగతనం చేశాననుకుంటున్నారో అవి నేను రాసిన పద్యాలే!"

"నీవు రాసినవా?" అన్నాడు దొర.

"అవును! కొన్నాళ్లకిందట ఆ పద్యాలు రాసి నా అసలుపేరు పెట్టుకోటానికి సిగ్గుపడి మారుపేరుతో ఒకపత్రికకు పంపాను. నాకు ఆశ్చర్యం కలిగేటట్టు అవి అచ్చయినై! అవే మళ్లీ కాలేజీపత్రికకు పంపాను.

అచ్చయినవే పంపానన్న నేరం నా మీద మోపబడితే నా కభ్యంతరం లేదు. నా కంతకంటె తెలివితేటలు లేవు! అసలుసంగతి అది!" విద్యార్థు లొక్కసారి గొల్లుమన్నారు.

"అవి నీవేనని రుజువుచెయ్యగలవా?" అన్నాడు దీక్షితులుగారు ముఖం మడతలుపడేసి.

"ఆపని చెయ్యాలిసింది మీరు!" అన్నాడు శాస్త్రి.

ప్రిన్సిపాల్ దొర ఆపత్రికాధిపతికి ఆపద్యాలురాసినవారి పేరు తెలియపరచ మని రాయటమూ, శాస్త్రి పేరు తిరుగుటపాలో రాగానే దీక్షితులుగారు నివ్వెరపోవటమూ, దొర కెదమ విరవటమూ ఇన్నీ జరిగినై.

దీక్షితులుగారు మండిపోయినారు. తనమీద ఒకకుర్రాడు జన్మలో మరచిపోని దెబ్బ తీశాడు. ఆ రోజునించీ ఆయన క్లాసులో విషం కక్కేవాడు వూరికేనే. రెండురోజులు పాఠం ఇలా తగలపడిపోవటం చూసి ఇద్దరు ధైర్యంచేసి దీక్షితులుగారు చెప్పేది ఏమీ అర్థం కావటం లేదని సవినయంగా మనవిచేశారు. కాని వారి రోదనం అరణ్యరోదనం అయింది.

చాటుగా పదిమంది విద్యార్థులు శాస్త్రిని వేనోళ్ల పొగడారు. కాని శాస్త్రికి ఆవిధంగా తృప్తి కలగలేదు. అతను చేసింది ఏముంది? దీక్షితులుగారు ఆయనంతట ఆయనే గోతిన పడ్డాడు. తనంతట తాను చెయ్యగలిగినప్పుడుగా?

ఇంతలో కాలేజీడే దగ్గిరికి వచ్చింది.

"చూసుకో" అన్నాడు ఒకరోజున శాస్త్రి స్నేహితుడితో.

"ఏమిటి?"

"చూస్తూ వుండు. కాలేజీడే దగ్గిరికి వస్తూంది కాదూ? కలెక్టరుగారు బహుమతులు ఇస్తారు కాదూ? చూడు మరి!"

"ఏమిటో చెప్పవూ?"

"ఇప్పుడు కాదు లే!"

"దీక్షితులుగారు సంగీతంలో గెలిచినవారికి నూరురూపాయలు బహుమానం ఇస్తారట! ఆయనకు సంగీతం అంటే ఎంతప్రీతి?"

"అదికాదు. రాధికకన్న ఎవరూ బాగా పాడలేరని ఆయననమ్మకం. నిజం అయితే కావచ్చుకూడ. రాధికకు ఈవిధంగా బహుమానం ఇయ్యాలన్న వూహా వుంది ఆయనకు!"

"ఆరి వీడి తస్సాచెక్కా! నువ్వు చెప్పింది నిజమేనోయి!"

"అయితే అలా జరగదు!"

"ఎందుకని?"

"దీక్షితులుగారి కోరిక నెరవేరటం భగవంతుడి కిష్టంలేదుకనక!"

"అంటే!"

"అంతే!"

* * *

హాలంతా నిశ్శబ్దంగా వుంది. వూళ్లో కొంతమంది పురప్రముఖులు కూడ విచ్చేశారు రాధికాగానామృతాన్ని గ్రోలటానికి. దీక్షితులుగారి మొఖం చాటల్లే అయివుంది. తన శిష్యురాలు పైకిరాబోతున్నది! మొదటిబహుమానాన్ని నిర్ణయించుటకు ఏర్పాటుచేయబడ్డవారిలో దీక్షితులుగా రొకరు.

ప్రిన్సిపాల్ లేచి సంగీతంపోటీ ప్రారంభంకావచ్చుననీ, ఆకాలేజీలో చదువుకునేవా రెవరైనా వచ్చి పదిహేనునిమిషాలకు మించకుండా పాడవచ్చుననీ, మొదటిబహుమానం వచ్చినవారికి నూరురూప్యములకిమ్మతుగల బహుమతి ఇయ్యబడుననీ సెలవిచ్చాడు.

సంగీతంలో అభిరుచిగల యువకు లిద్దరుముగ్గురు మొదటిబహుమానం రాదని తెలిసికూడ పాడారు. సభికులు అభినందించారు. అసలు బహుమానం జగన్నాథానికి తప్పదని అందరికీ తెలుసు. అతను కాలేజీలో అందరిలోకీ పేరుపొందినవాడు. ఇద్దరు విద్యార్థినులుకూడ గానం చేశారు. సభికులు పాట బాగుండకపోయినా మనుష్యుల్ని చూచి మెచ్చుకున్నారు. జగన్నాథం వచ్చాడు. పాడకముందే చప్పట్లు! రెండురాగాలు విదలించిపారేశాడు. హాలంతా మారుమోగిపోయింది కరతాళధ్వనులతో. తర్వాత రాధిక వేదిక నలంకరించింది. హాలంతా నిశ్శబ్దం! ఆమె పోటీచేసేవారిలో ఒకరనుకోలేదు అసలు విద్యార్థులు! సంగీతం నేర్చుకుంటున్నదని అందరికీ తెలుసుగాని ఇలా బయటపడుతుందని ఎవ్వరూ అనుకోలేదు! సన్నని గొంతుతో పాడింది. సభికులు

ఆశ్చర్యపోయినారు. ఆమె పాడటమే కాకుండా బాగా పాడుతున్నది. రెండుకీర్తనలు పాడింతరువాతగాని అందరికీ అర్థం కాలేదు ఆమె జగన్నాథంకంటె చాలాఅందంగా పాడుతున్నదని. మూడోకీర్తన పాడి ముచ్చటగా ముక్తాయింపుతో ముగించి నమస్కరించి దిగి వెళ్లిపోయి యథాస్థానంలో కూర్చుంది. దీక్షితులు గారి ఆనందానికి మేరలేదు. ఆయన లేచి ఏదో చెప్పుదా మనుకున్నాడు. కాని శాస్త్రి జనాన్ని సర్దుకుంటూ తనవైపు రావటం చూసి ఆగాడు. శాస్త్రి దగ్గరకు వచ్చి ఆయనకు నమస్కరించి వేదిక ఎక్కి సభికులకు నమస్కరించి కూచున్నాడు. పిలవకుండా ఎవరైనా భోజనానికి వచ్చి పీటముందు కూచుంటే మనకు కలిగేటంత ఆశ్చర్యం కలిగింది దీక్షితులుగారికీ, శాస్త్రినిఎరిగిన అందరికీ. రాధిక పాడటమే ఆశ్చర్యంగా వుంది విద్యార్థులకు. ఇప్పుడు శాస్త్రి పాడబోవటం దీక్షితులుగారికికూడా ఆశ్చర్యంగా వుంది. మాట్లాడకుండా ఆయన కుర్చీలో చతికిలబడ్డాడు కానున్నది కాకమానదని!

శాస్త్రి పాడాడు. ఇదివరకెన్నడూ అతను అందరిలో పాడలేదు. ఇప్పుడూ అతను పాడకుండావుండేవాడే. కాని అతని అంతరాత్మ అతన్ని ముందుకు నెట్టింది. అతనికి తప్పలేదు. చివరవరకూ పెనుగులాడాడు అంతరాత్మతో. లాభించలేదు. కళ్లు మూసుకుని పాడాడు ఒక్కటే కీర్తన. మొదటి వొకక్షణం అతనిగొంతు వణికినట్టు అతనికి అనుమానం కలిగింది. కళ్లు తెరిచాడు. ఎర్రబడి మంటపుడుతున్నాయి అతని నేత్రాలు. అందరూ అతనివంక విచిత్రంగా చూస్తున్నారు. లేచి నమస్కరించి దిగాడు. మరుక్షణం హాలు బద్దలయిపోయింది చప్పట్లతో!

శాస్త్రి ఇంటికెళ్లుతుండగా అతని స్నేహితులు దూరంగా తొలగి అతనివంక విచిత్రంగా చూడటం మొదలుపెట్టారు. పాతస్నేహితుడు మటుకు అతనిచెయ్యి పుచ్చుకుని ఆపి "ఎన్నడూ చెప్పలేదేం ?" అన్నాడు.

"ఏమిటి ?"

"నువ్వు పాడతావని !"

"ఎవరు పాడలేదు ?"

"అంత బాగానా ?"

"బాగుందా ?"

"నీకు తెలియదూ ?"

"నిజంగా తెలియదు. బాగుందని అనుమానమే ! నేనెన్నడూ అంతమందిలో పాడిలేదు !"

"ఇక మళ్లీ పాడకు !"

"ఏం ?"

"అంత బాగుండలేదేమో !"

"అహా! "

" మొత్తంమీద భలేవాడివి నువ్వు !"

"అప్పుడే ఏమయింది?"

"ఇంటికి వెళ్లుతున్నావా ?"

"ఆ!"

"బహుమానం తీసుకోవూ?"

" ఇంకా రెండుగంటలున్నది కదా. ఈలోపల వాళ్లు ఏదోనాటకం ఆడుతారు. కలెక్టరు బహుమానా లియ్యటానికి వచ్చేటప్పటికి నేనూ హాజరవుతాను ! ఇంటికెళ్లి వస్తాను. తల తిరుగుతున్నది."

నాటకం మంచి రసకందాయంలో వుంది. కలెక్టరూ, ఇంకా ఇతర స్త్రీపురుషప్రముఖులూ చాలామంది వచ్చారు. గిరీశం కోసేస్తున్నాడు ఏమిటేమిటో మధురవాణితో. దీక్షితులుగారు గాలికోసం బయటికి వచ్చాడు. వరాండాలో ఒక స్త్రీ, ఒకపురుషుడూ నిల్చుని మాట్లాడుతున్నారు. స్త్రీలంటేనే వుబలాటపడే దీక్షితులుగారి హృదయం ఎగిరి గంతేసింది. వారిని సమీపించాడు.

"ఏమోయ్ రామమూర్తీ! ఇప్పుడేం చేస్తున్నావు?" అన్నాడు దీక్షితులుగారు ఆశ్చర్యంతో.

"ఇంటిదగ్గిరే వుంటున్నానండీ. ఏదో మీ అనుగ్రహం!" అన్నాడతను.

రెండుసంవత్సరాలకిందట తను అతనిని డిబెయిన్ చెయ్యటంలోని డిటెయిల్స్ బాగా జ్ఞాపకం లేకపోయినప్పటికీ దీక్షితులుగారు అసలు సంగతిమటుకు మరచిపోలేదు.

"ఆమె ఎవరు?"అన్నాడు పక్కనున్న యువతిని చూస్తూ.

"మా చెల్లెలు. మద్రాసులో చదువుకుంటున్నది !"

మన కాలేజీ వుండగా అక్కడికి పంపావేమి అని అడగటానికి

ధైర్యం లేకపోయింది ఆయనకు. Art for Art Sake గా యువతీమణులతో తిరిగే ఎమెచూర్స్‌లో దీక్షితులుగా రోకడు. స్త్రీలకు-ముఖ్యంగా యౌవనంలో వున్నవనోధలకు ఇచ్చే గౌరవం, చూపే మర్యాదా ఆయన ఇంకెవరిమీదా చూపడు. ఆమె ఆయన్ని ఆకర్షించింది. కళ్లజోడులో నించి ఆమె విశాలనేత్రాలతో ఆయనను చూడగానే ఆ ఎలెక్ట్రిక్ లైట్ల వెలుతురులో ఆయన ముగ్ధుడయిపోయినాడు. ఏమిషమీద ఆమె హస్తాన్ని స్పృశించగలడు ? వంగ పండురంగుచీరెతో, ముంగురులు నాజూకుగా మొహంమీదికి వాలుతో పార్శీయువతిలా నెత్తిన ముసుగుతో వున్న ఆమెను చూస్తూంటే దీక్షితులుగారి అంతరాత్మ మూలుగుతున్నది.

"పేరు ?" అన్నాడు దీక్షితులుగారు.

"ఎవరి పేరు?"

"ఆమె పేరు ?"

"జయజయవంతి !"

"ఆ!"

"అదో రాగంపేరు. అదంటే ఈమెకు ఇష్టం. ఆపేరే ఈమె పెట్టుకున్నది!"

"బాగుంది!"

"వస్తామండీ, శెలవు!" అంటూ రామమూర్తి చెల్లెలుతో సహా హాలులో ప్రవేశించాడు. పోతూపోతూ జయజయవంతి దీక్షితులుగారి వంక రెండుక్షణాలు చూచింది. కళ్లజోడు తీసి మొహ మంతా తుడుచుకుని దీక్షితులుగారు ఎన్నడూ ఎరగని ఆవేదనతో వానరంతో డీవాలము వలె హాలులో ప్రవేశించాడు.

నాటకం అయిపోయింది. హాలంతా హడావిడిగా వుంది. ఈసంక్షోభంలో ప్రిన్సిపాల్ లేచి నిలబడ్డాడు. అందరూ నిశ్శబ్దంగా వున్నారు.

"ఈరోజు నాజన్మలో మరచిపోను! ఇంత జయవంతంగా ఈరోజునే నెరిగివుండగా ఎన్నడూ జరగలేదు. గెలిచినవారికి బహుమతులు ఇయ్యటానికి అంగీకరించి ఇచ్చటికి విచ్చేసి మాకు ఆనందం కలగచేసిన కలెక్టరుగారికి మేము కృతజ్ఞులం. బహుమతిపొందినవారందరూ పిలవగానే వచ్చి వారివారి బహుమానాలను తీసుకుపోవాలెనని కోరుతున్నాను."

మాట్లాడటం కాగానే అందరూ కరతాళధ్వనులు చేశారు. ప్రిన్సిపాల్‌గారు నిలబడి బహుమతిపొందినవారిని పేర్లుపెట్టి పిలిచాడు. ఒక్కొక్కరే వచ్చి బహుమానాల్ని తీసుకుపోతున్నారు.

"రామశాస్త్రి-సంగీతం మొదటి బహుమానం!" ఎవ్వరూ రాలేదు. ప్రిన్సిపాల్ మళ్లీ పిలిచాడు. ఎవ్వరూ. రాలేదు.

"సుబ్బారావు—ఫాన్సీడ్రెస్సుకు మొదటిబహుమానం. వేషం పాముల వాడు."

సుబ్బారావు లేచి నిలబడ్డాడు.

"మొదటిబహుమానం రావలిసింది నాకు కాదండీ. ముగ్గురు జడ్జీలతో ఒక్కరైనా నన్ను గుర్తుపట్టగలిగారు. రామశాస్త్రిని ఎవ్వరూ గుర్తుపట్టలేకపొయ్యారు—"

"ఏడీ రామశాస్త్రి?" అన్నాడు ప్రిన్సిపాల్.

జయజయవంతి లేచి నిలబడింది. అందరూ ఆశ్చర్యపోయినారు. దీక్షితులుగారు నోరు తెరుచుకుని ఆమె వంక చూస్తున్నాడు. ప్రిన్సిపాల్ నివ్వెరపడిపోయినాడు. చెప్పినా గుర్తుపట్టటానికి వీలులేకుండా వుంది రామశాస్త్రికి! హాలంతా ఒక్కసారి గొల్లుమన్నారు.

"మొదటి బహుమానం రామశాస్త్రి!" అన్నాడు మారుమాట్లాడకుండా ప్రిన్సిపాల్ ఆగోలలో.

దీక్షితులుగారివంక చూస్తూ శాస్త్రి ఆయనకు వళ్లు జలదరించేటట్టు గాలిలో ముద్దుపెట్టుకున్నాడు!